క్లుప్తంగా

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని యూఎస్‌పీసీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో ఆగస్టు 1న నిర్వహించే ధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11ఏళ్లు గడిచినా విద్యారంగ సమస్యలు పరిష్కరించటంలో విఫలమైందన్నారు. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గించి, ఉపాధ్యాయ సమస్యలపై నిర్లక్ష్య ధోరిణి అవలంభించటం సరికాదన్నారు. బదిలీలు, పదోన్నతుల విషయంలో తీవ్ర జాప్యం చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ నాయకులు చక్రపాణి, రాజావేణు, సంజీవ్, రమేశ్, రాజనర్సులు పాల్గొన్నారు.

చంద్రవెల్లిలో వైద్య శిబిరం


ఈసీజీ పరీక్ష కోసం వేచిచూస్తున్న గ్రామీణులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శ్రీ అన్నపూర్ణ సహిత సోమేశ్వర ఆలయం ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఆసుపత్రి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి గ్రామీణులు అధిక సంఖ్యలో తరలిరాగా వారికి ఈసీజీ, బీపీ, షుగర్, టూడీఎకో, జీఆర్బీఎస్ తదితర వైద్య పరీక్షలు చేశారు. ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామీణులకు కార్డియాలజీ, ఆర్థోపెడిక్, పల్మనాలజీ వైద్యసేవలు అందించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా జీవించాలని పలువురు సూచించారు. కార్యక్రమంలో ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు దినకర్, రవీంద్రచారి, ఫరానాజ్, విశాల్‌సింగ్, ఎంపీడీవో మహేందర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తిప్పారపు సారయ్యకు సన్మానం


సన్మానిస్తున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

జైపూర్: సింగరేణి మైన్స్‌అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్(హెచ్‌ఎంఎస్)సింగరేణి విభాగం అధ్యక్షుడిగా తిప్పారపు సారయ్య ఎన్నిక కాగా ఎస్టీపీపీ హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంఎస్ నాయకులు నూతనంగా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన సారయ్యను పూలమాలలు, శాలువాలతో సన్మానించి సత్కరించారు. కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి సారయ్య నాయకత్వంలో సమర్థవంతంగా పని చేయనున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్, నాయకులు విక్రమ్, ప్రదీప్, సాయికృష్ణ, రమేశ్, సంతోశ్, కుమార్‌లు తెలిపారు.

'ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయడం అన్యాయం'


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

చెన్నూర్: చెన్నూర్ నలగొండ పోచమ్మ వాడ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఈ నెల 24న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా కుర్చీలు అందజేస్తే, ఒక ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేస్తూ మరో ఆరుగురికి షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని బీఆర్‌ఎస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ మాజీ సర్పంచ్ సాధన బోయిన కృష్ణ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాయులపై కక్ష కట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. సస్పెన్షన్‌తో పాటు షోకాజ్ నోటీసులు ఎత్తివేసి ఉపాధ్యాయులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రేవెల్లి మహేశ్, నాయకులు సురేశ్‌రెడ్డి, కొండపర్తి వెంకటరాజం, కొప్పుల రవీందర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

జన్నారం: జన్నారం గుండా పగటిపూట భారీ వాహనాల రాకపోకల నిషేధం ఎత్తివేయాలని డిమాండ్‌తో సామాజిక వేత్త భూమాచారి, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్‌లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 12వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు వారి దీక్షలకు మద్దతు తెలిపారు. భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఎత్తివేసే వరకు ఆందోళన విరమించేది లేదని పేర్కొన్నారు.

అడుసు తొక్కితేనే అడుగు ముందుకు!


బురదమయంగా రైల్వేస్టేషన్ రహదారి


బురదమయమై పొలాల్లోకి వెళ్తున్న వర్షపు నీరు

దండేపల్లి/తాండూర్: చిన్నపాటి వర్షాలకే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. ప్రజలు, ప్రయాణికులకు అడుసు తొక్కితేనే అడుగు ముందుకు కదిలేలా తయారయ్యాయి. సరైన రోడ్డు మార్గం లేక బురదమయమై నీరు నిలిచిన రోడ్డుపై నడక సాగించలేని పరిస్థితి. తాండూర్‌లో ప్రయాణికులు రైలు ఎక్కాలంటే బురదలో విన్యాసాలు చేయాల్సి వస్తోంది. అచ్చలాపూర్ నుంచి బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామం వరకు మంజూరైన రోడ్డు పనులను గతేడాది ప్రారంభించారు. అచ్చలాపూర్ సమీపంలో కేవలం కల్వర్టు పనులు మాత్రమే చేపట్టి రోడ్డు పనులను చేపట్టలేదు. కల్వర్టు నిర్మాణంలో భాగంగా తోడిన మట్టిని పక్కకు పోయడంతో పక్క కాలువల్లో మట్టి నిండి వర్షపు నీరు పోయేందుకు దారిలేక నీరు మొత్తం పొలాల్లోకి వెళ్తోంది. దీనికి తోడు రోడ్డుపై గట్టి మొరం పోయాల్సి ఉండగా కల్వర్టులో తీసిన మట్టినే పోయడంతో రోడ్డంతా బురదమయమైంది. మోకాలు లోతు బురదలో రైతులు రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. దండేపల్లి మండలంలోని నెల్కివెంకటాపూర్‌లో డిస్ట్రిబ్యూటరీ 30 కాల్వను ఆనుకొని ఉన్న రోడ్డు బురదమయంగా మారి అధ్వానంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో రోడ్డు పనులు చేపట్టి ఇక్కట్లు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.


నెల్కివెంకటాపూర్‌లో బురద రోడ్డు..

మరోసారి తరలింపు!


మహాత్మజ్యోతిబాపూలే గురుకుల భవన సముదాయం

- అద్దె భవనంలో తాండూర్ ఎంజేపీ గురుకులం నిర్వహణ
- రైల్వే లైన్ విస్తరణతో కొనసాగింపుపై నీలినీడలు
- మరో చోటుకు తరలిస్తారనే ప్రచారం
- శాశ్వత భవనం నిర్మించాలని విద్యార్థుల డిమాండ్

తాండూర్: ఎన్నో ఆందోళనలతో బెల్లంపల్లి నుంచి తాండూర్‌కు తరలివచ్చిన తాండూర్ మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల విద్యాలయం మళ్లీ వేరే చోటికి తరలిపోక తప్పదనే సంకేతాలు కనిపిస్తున్నాయి. తాండూర్ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఓ ప్రైవేట్ అద్దె భవనంలో ఆరు సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ గురుకుల భవన సముదాయానికి రైల్వే విస్తరణ పనుల గండం పొంచి ఉంది. దీంతో తాండూర్‌లో గురుకుల విద్యాలయం కొనసాగింపుపై నీలినీడలు కమ్ముకోవడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

480మంది విద్యార్థులు.. 20గదులు

తాండూర్ మండలానికి కేటాయించిన మహాత్మజ్యోతిబాపూలే గురుకుల విద్యాలయం తొలుత బెల్లంపల్లిలోని ఓ ప్రైవేట్ భవనంలో ఏర్పాటు చేశారు. 2019లో స్థానిక బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చేసిన పలు ఆందోళనలు, నిరసనలతో అధికార యంత్రాంగం దిగివచ్చి తాండూర్‌కు తరలించారు. ఇక్కడ ఓ అద్దె భవనంలో పాఠశాల నిర్వహణ ఏర్పాటు చేశారు. గురుకులంలో 480మంది విద్యార్థులు ప్రవేశం పొందగా వీరికి కేవలం 20గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యా బోధన చేయాల్సి ఉండగా అమలుకావడం లేదు. సరిపడా గదులు లేక 10వ తరగతి వరకు ఇక్కడ కొనసాగిస్తూ ఇంటర్మీడియట్ చదివే 160మంది విద్యార్థులను చెన్నూర్, లక్సెట్టిపేట గురుకులాల్లో సర్దుబాటు చేశారు. విద్యార్థులు మధ్యాహ్నం పూట తరగతులు వింటూ, రాత్రి అదే గదిలో నిద్రపోతూ తీవ్ర అసౌకర్యానికి గురవుతూ, ఎన్నో అవస్థలు పడుతున్నారు.

రైల్వే విస్తరణ పనుల గండం..

భవన యజమాని గతేడాది అక్టోబర్‌లో పాఠశాల భవనాన్ని ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వగా సంబంధిత అధికారులు నచ్చచెబుతూ నెట్టుకొస్తున్నారు. ప్రత్యామ్నాయం లేక నేటికీ అదే భవనంలో బోధిస్తున్నారు. తాజాగా రైల్వే 3వ లైన్ విస్తరణ పనుల్లో భాగంగా గురుకుల విద్యాలయం భవనానికి సంబంధించిన వంటశాల, మరుగుదొడ్ల తొలగింపునకు గురయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి రైల్వేశాఖ నోటీసులు కూడా జారీ చేసినట్లు సమాచారం. అదే జరిగితే విద్యార్థులు మరింత ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఇప్పటికే సరిపడా గదులు లేక అవస్థలు పడుతూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు రైల్వే విస్తరణ అంశం మరింత ప్రతికూలంగా మారే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అంతంతే...

తాండూర్ మండలానికి మహాత్మజ్యోతిబాపూలే పాఠశాల మంజూరైనప్పటి నుంచి శాశ్వత భవన నిర్మాణం కోసం స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు లేఖలు రాయడం, ఆ తర్వాత ఎలాంటి స్పందన లేకపోవడం పరిపాటిగా మారింది. ఇటీవల కలెక్టర్ మండలంలోని మాదారంటౌన్‌షిప్ సింగరేణి పాఠశాల భవనాన్ని పరిశీలించారు. దీంతో ఎంజేపీ గురుకులం మాదారంలో ఏర్పాటు చేస్తారనే ప్రచారం జరిగింది. కానీ ఎంతో వేగంగా జరిగిన పరిణామాలు అంతే వేగంగా స్తబ్ధతగా మారిపోయాయి. సింగరేణి పాఠశాల భవన సముదాయం మినహా మండలంలో అంత పెద్ద భవనం లేకపోవడంతో గురుకుల విద్యాలయం మంచిర్యాలకు తరలిస్తారని చర్చించుకుంటున్నారు. ఈ పరిణామాల క్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు స్పందించి తాండూర్‌లోనే సరైన వసతులు కల్పించి కొనసాగించేలా చర్యలు తీసుకోవడంతో పాటు శాశ్వత భవన నిర్మాణాన్ని చేపట్టాలని తల్లిదండ్రులు, మండల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

స్థానికంగా నెలకొన్న పరిస్థితులు, శాశ్వత భవనం యొక్క ఆవశ్యకతపై ఇప్పటికే బెల్లంపల్లి ఎమ్మెల్యేతో పాటు ఉన్నతాధికారులకు నివేదించాం. వారి నిర్ణయం కోసం వేచి చూస్తున్నాం. శాశ్వత భవనం మంజూరైతే తప్పా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావు. ఈ విద్యా సంవత్సరమన్న ఇక్కడ కొనసాగేలా ప్రయత్నాలు చేస్తున్నాం.

– వినోద్ కుమార్, ప్రిన్సిపాల్, ఎంజేపీ, తాండూర్

ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు సన్నద్ధం

- మండలానికి నాలుగు యూనిట్లు మంజూరు
- ఒక్కో యూనిట్ ఏర్పాటుకు రూ.ఐదు లక్షలు కేటాయింపు


సిద్ధంగా ఉన్న జిమ్ పరికరాలు

తాండూర్: ఎన్నో రోజులుగా ఓపెన్ జిమ్‌ల కోసం ఎదురుచూస్తున్న స్థానికుల కోరిక నేటికి నెరవేరనుంది. ఎట్టకేలకు తాండూర్ మండలానికి నాలుగు ఓపెన్ జిమ్‌లు మంజూరయ్యాయి. ఒక్కో యూనిట్‌కు రూ.5లక్షల చొప్పున రూ.20లక్షల నిధులు కేటాయించారు. మండలంలోని మాదారం టౌన్‌షిప్, తాండూర్ ఐబీ, తాండూర్, అచ్చలాపూర్ గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి సామగ్రి ఇప్పటికే ఆయా గ్రామాలకు చేరింది. ఓపెన్ జిమ్‌లను అమర్చేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. మండలంలోని ఈ నాలుగు ప్రాంతాల్లో జిమ్ ఏర్పాటుకు అవసరమైన పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. జిమ్‌ల ఏర్పాటు త్వరితగతిన పూర్తయితే యువకులకు, వ్యాయామం చేసేవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నిత్యం వ్యాయామం చేసే వారికి ఓపెన్ జిమ్ ఏర్పాటుతో పాటు సరైన వసతులు కల్పిస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుంది. అందుకు అనుగుణంగా త్వరితగతిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కంటి వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని లయన్స్‌క్లబ్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కుందారం, నెన్నెల, బెల్లంపల్లి, కాసిపేట, లక్సెట్టిపేట, జైపూర్, శివ్వారం, శ్రీరాంపూర్‌కు చెందిన కంటి సమస్యలతో బాధపడుతున్న 100మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా, 45మందికి కంటి శస్త్ర చికిత్స అవసరమని కంటి వైద్య నిపుణులు అభిషేక్, రాకేష్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి నిర్ధారించారు. కరీంనగర్ రేకుర్తిలోని లయన్స్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి శస్త్ర చికిత్స నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్టు జనరల్ సెక్రెటరీ కంకణాల భాస్కర్‌రెడ్డి తెలిపారు. కంటి ఆపరేషన్లు ఆగస్టు 5న మంగళవారం నిర్వహిస్తారని, ఆపరేషన్లు చేయించుకునే వారు, వారి వెంట ఒకరిని సహాయకులుగా తీసుకురావాలని తెలిపారు.

కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

రామకృష్ణాపూర్: బీఆర్‌ఎస్ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్యాతనపల్లి హైవేపై దగ్ధం చేశారు. పార్టీ సీనియర్ నాయకురాలు పార్వతి విజయ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్న రేవంత్‌రెడ్డిపై తరచూ అనుచిత వ్యాఖ్యలు చేయటం పరిపాటైందని, ఇక మీదట అలా చేస్తే మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ విజయ, లక్ష్మి, పద్మ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్లు శిథిలం!



దండేపల్లి: మండల కేంద్రంలో కొన్నేండ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్లు పగుళ్లు తేలి పూర్తి శిథిలావస్థకు చేరాయి. నేతకానీ కాలనీలో పోచమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డుతో పాటు, తెనుగువాడలో ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రోడ్డు శిథిలమైంది. అధికారులు స్పందించి శిథిలమైన సీసీరోడ్ల స్థానంలో కొత్త రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

← శిథిలమైన నేతకాని వాడ రోడ్డు

పగుళ్లు తేలి శిథిలమైన తెనుగు వాడ రోడ్డు →



సాగునీరు ముందుకెళ్లేదెలా..?



పిచ్చి మొక్కలు, చెత్తతో నిండుకుపోయి కనిపిస్తున్నది చూసి ఇదేమిటో అనుకునేరు. ఇదీ దండేపల్లి మండలంలోని తాళ్లపేట సమీపంలో గల కడెం ప్రాజెక్టు 23వ డిస్ట్రిబ్యూటరీ కాల్వ. ప్రస్తుతం వానాకాలం పనులు మొదలయ్యాయి. మరో వైపు కడెం ప్రాజెక్టు నీళ్లు వస్తున్నప్పటికీ, కాల్వ పరిస్థితి మరీ అధ్వానంగా ఉండటంతో నీళ్లు ముందుకు కదలట్లేదు. గతంలోనూ రైతులే కాల్వ పూడికను తీయించారు. ఇప్పుడు కూడా కాల్వనిండ పూడిక, పిచ్చిమొక్కలు నిండిపోవడంతో కాల్వ ఆనవాళ్లే కనిపించడం లేదు. అధికారులు స్పందించి డిస్ట్రిబ్యూటరీ కాల్వలో పేరుకు పోయిన చెత్త, పిచ్చిమొక్కలు తొలగించి సాగునీరు ముందుకెళ్లేలా చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

– దండేపల్లి

వాగు కాదు.. రోడ్డే

భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామ పంచాయతీ పరిధిలోని నేరేడుపల్లి పద్మశాలివీధిలో వర్షం వస్తే చాలు రోడ్డు వాగులా మారుతోంది. వర్షం నీళ్లు వెళ్లేందుకు మురుగుకాలువలు లేకపోవడంతో నీళ్లు మొత్తం రోడ్డు గుండా ప్రవహిస్తున్నాయని స్థానికులు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకొని డ్రెయినేజీలు నిర్మించాలని వారు కోరుతున్నారు.




'అపూర్వ' సమ్మేళనం

మందమర్రిరూరల్: పట్టణంలోని అరుణోదయ హైస్కూల్లో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు క్షేమసమాచారాలు తెలుసుకొని, జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేసి అనంతరం చదువు చెప్పిన గురువులను సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

● మనఊరు-మనబడి పనులు పూర్తి చేయాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో శిథిలావస్థలో ఉన్న భవనాలు పరిశీలించి నూతన భవనాలు నిర్మించాలని, మన ఊరు-మనబడి కింద చేపట్టిన పనులు పూర్తి చేయాలని పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మార్క్స్‌భవన్‌లో ఆదివారం ఏర్పా టు చేసిన పీడీఎస్‌యూ సంమావేశంలో మా ట్లాడుతూ.. ప్రభుత్వం ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయటం స్వాగతిస్తున్నామని, పాత బిల్డింగ్‌లు కూలిపోయే పరిస్థితి ఉందన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే శిథిల భవనాలు తొలగించి కొత్త భవనాలు నిర్మించాలన్నారు.

● పేకాటస్థావరంపై దాడి

మందమర్రిరూరల్: పట్టణంలోని శాంతినగర్ ఏరియాలో శివ అనే వ్యక్తి ఇంట్లో పేకాటస్థావరంపై ఆదివారం దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.38వేల 150 నగదు, ఆరు ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. అరెస్టైన వారిలో కట్టా దుర్గారావు, దాసరి నర్సయ్య, పుడమ శివ, గరిక కుమార్, వేకల రాజశేఖర్, కట్టా రమణ, తన్నీరు రవి ఉన్నారు. ఈ దాడిలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై రాజశేఖర్, ఏఎస్సై మిలింద్ కుమార్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాకేష్, విశ్వనాథ్, కృష్ణ చైతన్యలను సీఐ శశిధర్‌రెడ్డి అభినందించారు.

● రైతులకు సూచనలు

భీమారం: కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రైతులు వారు పండిస్తున్న పంటల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆదివారం మండల వ్యవసాయ అధికారి అత్తె సుధాకర్ వివరించారు. పొలం నుంచి మురుగు నీటిని వీలైనంత త్వరగా తొలగించాలని కోరారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో, పంట పొలాల్లో పురుగు మందుల పిచికారీతో పాటు ఎరువులను అందించడం తాత్కాలికంగా వాయిదా వేయాలని రైతులకు సూచించారు.

● కొమ్మలు తొలగించాలి

మందమర్రిరూరల్: పట్టణంలోని దొరలబంగ్లాస్ ఏరియా, ఊరు రామకృష్ణాపూర్ వెళ్లే దారి పక్కన విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పెరిగి ప్రమాదకరంగా ఉన్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి ఆరోపించారు. పట్టణంలోని పలు ఏరియాలను ఆదివారం సందర్శించి సమస్యలు పరిశీలించారు. విద్యుత్ శాఖ అధికారులు కొమ్మలు తొలగించి ప్రమాదాలను నివారించాలని పేర్కొన్నారు.

● సంబురాలకు తరలిన మహిళలు

నెన్నెల: బెల్లంపల్లి పట్టణం కన్నాలలోని ఆర్సీ గార్డెన్‌లో ఎమ్మెల్యే వినోద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి మహిళా శక్తి సంబురాలకు నెన్నెల మండల మహిళా సంఘాల సభ్యులు తరలివెళ్లారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల: సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి: విజయ్ ప్రకాశ్ - 9440208447
చెన్నూర్: సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899